01ATP20F_01ATP20F.qxd 20-11-2025 PM 11:00 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శుక్రవారం 21 నవంబర్ 2025 పేజీలు : 04

సత్యసాయి బోధనలు నిరంతర ప్రేరణ ఇస్తుంటాయి

-కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

సాయి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జీవితం, ఆయన బోధించిన విలువలు మానవాళిని ముందుకు నడిపిస్తూ, మంచి పనులు చేయడానికి నిరంతరం ప్రేరణనిస్తూనే ఉంటాయని భారత దేశ రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి చేరుకున్నారు. ఆయనకు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర ప్రభుత్వ రవాణా ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణ బాబు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పి ఎస్.సతీష్‌కుమార్, 13వ నెహ్రూ యువ కేంద్ర జాతీయ వైస్ చైర్మన్, బిజెపి నాయకులు ఎస్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రశాంతి నిలయం చేరుకొని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భక్తులను ఉద్దేశించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, తాను ఎవరినీ బోధించటానికి రాలేదని, ఇక్కడి భక్తి, విలువలు, సేవా భావాన్ని చూసి ఇంకా ఎక్కువ మంచి పని చేయడానికి ప్రేరణ పొందటానికే వచ్చానని వినమ్రంగా తెలిపారు. సరళతను ప్రధానంగా ప్రస్తావిస్తూ, తాను ఇంజనీరు కానీ సాంకేతిక నిపుణుడు కానీ కాదని, మంచి విద్య, సత్సంగతి, సత్ప్రవర్తన ఇవే ఒక మనిషిని ఉత్తముడిగా తీర్చిదిద్దే మహత్తర గుణాలు అని అన్నారు. జీవితంలో శాంతి ఎంతో ముఖ్యమని, శాంతి ఉన్నచోట సమస్యలు సహజంగానే పరిష్కారాలు పొందుతాయని చెప్పారు. మనకు అవసరమైన దానికంటే ఎక్కువగానే భగవంతుడు ప్రసాదిస్తాడని, వర్తమానంలో జీవిస్తే ఆనందం లభిస్తుందని, భవిష్యత్తుపై ఆందోళన పెంచుకుంటే అశాంతి పెరుగుతుందని గుర్తుచేశారు. ఒక ప్రముఖ వ్యక్తి మాటలను స్మరించుకుంటూ, "ఆకలితో ఉన్న వ్యక్తికి ఆధ్యాత్మికతను బోధించకండి. ముందుగా సేవ చేయండి," అని చెప్పారు. మంచి ఆలోచనలు అన్నింటినీ మార్చగలవని, విజ్ఞానాన్ని సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా సంపదగా మార్చగలిగితేనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని వివరించారు. సభ అనంతరం ఆయన శ్రీసత్యసాయి విమానాశ్రయం నుండి బెంగుళూరుకు తిరుగు ప్రయాణమై బయలుదేరి వెళ్ళారు.

మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్

నేడు పుట్టపర్తికి రానున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్

పుట్టపర్తి, నవంబర్ 20, ప్రభాతవార్త

మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాలుపంచు కునేం దుకు శుక్రవారం పుట్టపర్తికి రాను న్నట్లు అధికార వర్గాలు తెలియ జేశాయి. ఆయన ప్రత్యేక విమానంలో ఉదయం 09:15 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకుంటారని, అక్కడి నుండి ప్రత్యేక కాన్వాయ్‌లో 09:25 గంటలకు సత్యసాయి ప్రశాంతి నిలయం చేరుకుంటారన్నారు. 09:30 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని శతజయంతి ఉత్సవాలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. అనంతరం ఉదయం 11:00 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకొని ముంబాయికి తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

సాయి సన్నిధిలో ఘనంగా IIవ ప్రపంచ సదస్సు

- పాల్గొన్న 125 దేశాల ప్రతినిధులు
- ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరి



మహా సమాధిని దర్శిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ

వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు

పుట్టపర్తి రూరల్ నవంబర్ 20 ప్రభాతవార్త

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి సేవా సంస్థల 11వ ప్రపంచ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు కేంద్ర జాతీయ రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి ప్రశాంతి నిలయం చేరుకున్న ప్రతినిధులు వారి దేశ పతాకాన్ని చేత పట్టుకొని సత్యసాయి మహాసమాధి చెంతకు ఊరేగింపుగా వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ధన్యవాదములు శ్రీ సత్యసాయి అను గీతాన్ని బృందంగా చేరి ఆలపించారు. అనంతరం సదస్సు కార్యాచరణను మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ , ట్రస్టు సభ్యులు ఎస్ఎస్ నాగనంద్, డాక్టర్ మోహన్‌లతో కలిసి ప్రారంభించారు. స్వాగత ఉపన్యాసాన్ని శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్.ఎస్.నాగానంద్ మాట్లాడుతూ శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా నేషనల్ లీడర్షిప్ ప్రోగ్రాంలో యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,పీజీ, నేపాల్, శ్రీలంక, చైనా, జపాన్, ఇండోనేషియా, యూరోప్ , మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా మొదలకు దేశాలలో సేవాదళ్ సభ్యులు ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలలో, ప్రకృతి విలయ సమయాలలో అనేక సేవలను నిర్వహిస్తున్నారన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య మాట్లాడుతూ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని 10 జోన్ల నుండి 135 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి అయిన నితిన్ గడ్కరీ పాల్గొని సత్యసాయి చేస్తున్న నిస్వార్థ సేవలను గురించి ప్రసంగించారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర

కార్యచరణ ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవితమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఈ సదస్సు పూర్ణచంద్ర ఆడిటోరియంలో కొనసాగింది. ఈ సదస్సుకు విదేశాల నుండి దాదాపు 3000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తిరిగి సాయంత్రం సాయి కుల్వంత్ సభ మండపంలో గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని యువతి యువకులు అద్భుతమైన సంగీత గాన కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూరోప్ భక్తులు ఆలపించిన "శివ.. శివ.. శివ... వినరాద..." అనుగీతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ట్రస్ట్ వర్గాలు కళాకారులకు నూతన వస్త్రాలను బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయిభక్తులు పాల్గొన్నారు. ప్రశాంతి నిలయంలో శుక్రవారం కార్యక్రమాలు వేదంతో ప్రారంభమవుతాయి. అనంతరం గ్లోబల్ కౌన్సిల్ యువత చేత సంగీత కార్యక్రమం నిర్వహించబడుతుంది. ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్ ప్రసంగం, వీడియో ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం గ్లోబల్ కౌన్సిల్ కన్వీనర్ శివేంద్ర కుమార్, నేషనల్ సేవాదళ్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు , జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య ప్రసంగాలు చేయనున్నారు. తదుపరి రాహుల్ దేశ్ పాండే బృందం సంగీత కచేరిని నిర్వహిస్తారు.

వైభవోపేతంగా కొనసాగుతున్న బాబా శత జయంతి ఉత్సవాలు

- జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్

జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో బాబా శతజయంతి వేడుకలు చారిత్రాత్మకంగా, భక్తులు ఎలాంటి ఇబ్బందులను అద్వితీయంగా జరుగున్నాయన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, గడ్కరీ, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్య కుమార్ యాదవ్, సవితమ్మ, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, ప్రముఖ సినీ నటి ఐశ్వరరాయ్ బచ్చన్, ఎన్ హెచ్ ఆర్ సి అధ్యక్షులు రామ సుబ్రహ్మణ్యన్, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొనడం జరిగిందనా న్నారు. ఇప్పటివరకు పుట్టపర్తి పుణ్య క్షేత్రానికి 424153 మంది భక్తులు విచ్చేశారని, ఇందులో చాలా మంది సాయి100 యాప్ ద్వారా తమ సందర్శన వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం పలు రైల్వే స్టేషన్ల నుండి పుట్టపర్తికి 261 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడపగా, ఇప్పటి వరకు 14272 మంది యాత్రికులు రవాణాసేవలు వినియోగించుకున్నారన్నారు. అదనంగా 4606 మంది యాత్రికులు ఉచిత షటిల్ బస్సు సర్వీసుల ద్వారా పుట్టపర్తికి చేరుకున్నారని, 230 మంది వివిఐపి లకు వాహనాలు, మినీబస్సులు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల సౌకర్యార్థం తాత్కాలిక బస ఏర్పాట్ల భాగంగా వెస్ట్ గేటు, ఎనుములపల్లి, ప్రశాంతి నిలయంలో 1,92,151 మందికి బస ఏర్పాటు చేశామని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో 25 దాకా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 8011 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 95 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను చేశామని, ట్యాంకర్లద్వారా 42 కేంద్రాలలో త్రాగునీటి సరఫరా, పురుషులకు, మహిళలకు వేరువేరుగా 150 చొప్పున తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 356683 మంది భక్తులకు ఉచితంగా అన్నదానం చేశామన్నారు. 5500 మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశామని, అత్యవసర సమయాల్లో సేవలందించే విధంగా 18 దాకా గుర్తించిన ప్రదేశాలలో అగ్నిమాపక సేవలను అందించడంజరుగుతుందన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం 25 సపోర్ట్ 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదనంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సిలు) వంటి 13 ప్రదేశాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అక్కడ అవసరమైన ఔషధాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.. ఇప్పటివరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ సమస్యలపై స్పందించి 40 దాకా సమస్యలను పరిష్కరించడంతో పాటు సాయి 100 యాప్ ద్వారా 23 ఫిర్యాదులను స్వీకరించి వాటిపై తక్షణ పరిష్కార చర్యలు తీసుకొని పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే శిల్పారామం వద్ద సెర్ఫ్ ద్వారా హస్తకళల శిబిరాలు, ప్రతిరోజు సాయంత్రం సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రావతి నదీలో తెప్పోత్సవం, లేజర్ షో ద్వారా సందర్శకులు ఆకట్టుకునే విధంగా ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

పర్యాటకరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది

- టూరిజం శాఖను సర్క్యూట్లుగా విభజిస్తున్నాం
- రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్

లేపాక్షి ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్

లేపాక్షి, నవంబర్ 20 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ, శ్రీనివాస్ కువార్లు పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. ఆలయంలోని శాసనాలు, ఏడు పడగల నాగేంద్రుడు, అసంపూర్తి కళ్యాణమండపం, నాట్యమండపంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాల చరిత్రను తెలుసుకున్నారు. అనంతరం దుర్గాదేవి వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం మర్యాదలతో మంత్రిని ఘనంగా సత్కరించారు. లేపాక్షి ఆలయం సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. లేపాక్షి ఆలయం శిల్ప, చిత్రకళలకు నిలయమన్నారు. 500 సంవత్సరాల క్రితం విరూపన్న నిర్మించిన ఈ ఆలయంలో కళానైపుణ్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. పురాణ ఇతిహాసాలను ఆలయంలోని చిత్రాలు, శిల్పాలు తెలియజేస్తాయన్నారు. పర్యాటకరంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర టూరిజం రంగాన్ని సర్క్యూట్‌గా విభజిస్తున్నామన్నారు. లేపాక్షికి వచ్చిన పర్యాటకులు పుట్టపర్తి, కదిరి, తదితర ప్రాంతాలను పర్యటించే విధంగా వసతులను కల్పిస్తామన్నారు. పబ్లిక్ ప్రైవేట్ రంగంలో వసతుల కోసం కృషి చేస్తామన్నారు. ఒక్కొక్క ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తయారు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 17 వేల కోట్ల రూపాయలు పర్యాటక రంగం నుండి ఆకర్షించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లేపాక్షి నందిని యునెస్కో గుర్తింపుకు పంపారా, లేదా అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా వైజాగ్ ఎర్ర మట్టి దిబ్బలను, అహోబిలం ఆలయాలను యునెస్కో గుర్తింపుకు పంపడం జరిగిందన్నారు. లేపాక్షి నందిని కూడా యునెస్కో గుర్తింపుకు పంపే బాధ్యతను పురావస్తు శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. టూరిజం శాఖను ప్రైవేట్ పరం చేస్తారనే విషయాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టూరిజం శాఖ మంత్రి

బయటకు వస్తున్నాయని మరో విలేకరి ప్రశ్నించగా ప్రస్తుతానికి అటువంటిది ఏమీ లేదన్నారు. ఋషికొండలో ప్రతి సంవత్సరం టూరిజం శాఖకు ఏడు కోట్లు ఆదాయం వస్తుండేదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్యాలెస్ నిర్మించడంతో ఆదాయం పడిపోయిందన్నారు. టూరిజం శాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. లేపాక్షి ఉత్సవాలను గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. లేపాక్షి ఉత్సవాలకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని మంత్రి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, జనసేన మండల నాయకులు బాలాజీ, లోకేష్, చిలమత్తూరు జనసేన కన్వీనర్ చిన్న ప్రవీణ్, హిందూపురం మండల జనసేన నాయకులు చక్రవర్తి, టూరిజం శాఖ అధికారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గిగా స్కేల్ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమ ఏర్పాటుతో కళ్యాణదుర్గంకు మహర్దశ

ఎమ్మెల్యే సురేంద్రబాబు అభివృద్ధి ప్రణాళికలో ఇదో మైలురాయి

కళ్యాణదుర్గం నవంబర్ 20 ప్రభాత వార్త :

దేశంలోనే తొలిసారిగా స్కేల్ ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను ఆంధ్రప్రదేశ్లోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికి బెంగళూరుకు చెందిన సర్లా ఏవియేషన్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మెగా ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఒప్పందం విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామంలో 500 ఎకరాలలో ఈ ఏరోస్పేస్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం ప్రాజెక్ట్‌పై రూ.1300 కోట్ల పెట్టుబడి ప్రకటించారు. ఈ యూనిట్‌లో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (జుగిపీలి) ఎయిర్ ట్యాక్సీలను తయారు చేస్తారు. ప్రారంభ దశలో సంవత్సరానికి 1000 ఎయిర్‌క్రాఫ్ట్‌లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్ట్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశలో 150 ఎకరాలలో రూ.330 కోట్ల వ్యయంతో మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. రెండో దశలో మిగిలిన 350 ఎకరాలను అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్‌లో ఆధునిక ఖి దీ సెంటర్లు, హైటెక్ ల్యాబ్స్, రెండు కిలోమీటర్ల రన్‌వే వంటి సదుపాయాలు నిర్మిస్తారు. ఇవన్నీ ఫ్లైట్ టెస్టింగ్ మరియు నాణ్యత పరిశీలనల కు ఉపయోగపడతాయి. ఈ ప్రాజెక్టు పూర్తిగా ప్రారంభమైతే, సీఎం చంద్రబాబు ప్రకటించినట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ ట్యాక్సీలు నడిచే రోజులెంత దూరంలో లేవనేది స్పష్టమవుతోంది. ఏరోస్పేస్ రంగంలో ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇంత పెద్ద ప్రాజెక్ట్ అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం నియోజకవర్గం రావడం ఆప్రాంత ఆర్థికపరిస్థితికి కూడా పెద్ద మద్దతునిస్తుంది. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరగడం, ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడం, చిన్న స్థాయి పరిశ్రమలకు కొత్త అవకాశాలు రావడం ఖాయం. మొత్తం మీద, ఈ ప్రాజెక్ట్ అంతర్జాతీయ స్థాయి తయారీ కేంద్రంగా ఏపీలో ముఖ్యంగా కళ్యాణదుర్గంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఎమ్మెల్యేసురేంద్రబాబు ఎన్నికలసమయంలో హామీ ఇచ్చినట్లుగానే తిమ్మసముద్రాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయటంలో అహర్నిశలు కృషి చేస్తున్నారనడంలో సందేహం లేదు.



ఎయిర్ టాక్సీ మ్యానుఫ్యాక్చరింగ్ నమూనాలు

మంత్రిని కలిసిన జనసేన నాయకులు

హిందూపురం నవంబర్ 20 ప్రభాతవార్త



మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

లేపాక్షికి విచ్చేసిన పర్యాటక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కు గురువారం హిందూపురం జనసేన నాయకులుస్వాగతం పలికారు. పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్, జనసేన పార్టీ హిందూపురం మండల అధ్యక్షుడు చక్రవర్తి(చక్రి) మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెలుగుప్ప విద్యార్థులు

బెలుగుప్ప, నవంబర్ 20 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -14 సాఫ్ట్‌బాల్ ఉమ్మడి అనంతపురం జిల్లా సెలక్షన్స్ అనంత స్పోర్ట్స్ విలేజ్‌లో బుధవారం జరిగాయి. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెలుగుప్పకు చెందిన హరి సాధ్విక్ 8వ తరగతి అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 22 నుండి 24 వరకు రాష్ట్రస్థాయి పోటీలుపులివెందులలో విద్యార్థిని పాల్గొంటుంది. అదేవిధంగా 16న అండర్ -17 బేస్‌బాల్ ఉమ్మడి జిల్లా సెలక్షన్లు నిర్వహించగా 8వ తరగతి విద్యార్థి రాజశేఖర్ ప్రతిభ కనబరచి ఎంపికయ్యాడు. ఈ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ఈనెల నవంబర్ 26 నుండి 28వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -17 బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను గుత్తి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి మల్లారెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజయంతో తిరిగి రావాలని, మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, గోపాల్ రెడ్డి పిడి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రుద్రన్న, గోవింద్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నేడు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

బెలుగుప్ప, నవంబర్ 20 ప్రభాతవార్త

మండల కన్వీనర్ చిన్న మచ్చన్న

ప్రభుత్వం ప్రవేవ పెట్టాలని చూస్తున్న పిపిపి విధానానికి వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న కోటి సంతకాలలో భాగంగా మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్ఆర్‌సిపి కార్యదర్శి చిన్న మచ్చన్న తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి హాజరవుతున్నారు. జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న మండల పరిశీలకులుగా ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు జల్లిపల్లి దేవేంద్ర హాజరవుతున్నట్లు తెలిపారు. కావున మండలంలోని జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, సర్పంచులు, మండల కమిటీ సభ్యులు అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు కొత్తగా నియమింపబడ్డ గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యలు పరిష్కారం కొరకు దర్బార్

గుమ్మఘట్ట నవంబర్ 20 ప్రభాత వార్త

మండల కన్వీనర్ కాలువ సన్నన్న

మండల పరిషత్ కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కారం వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొంటున్నారు ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారు. కావున ఈ కార్యక్రమానికి ప్రజలు సమస్యలు పరిష్కారం కొరకు తమ ఆధార్ కార్డు తో పాటు హాజరు అవ్వాలని ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల కన్వీనర్ కాలువ సన్నన్న కోరారు

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి అడుగులు వేద్దాం సిడిపిఓ లక్ష్మీప్రసన్న

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ

కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 20 ప్రభాతవార్త

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని కళ్యాణదుర్గం సిడిపిఓ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు ఆమె గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు అందించేటువంటి విద్య సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు ఈసీసీ కార్యక్రమాలు బలోపేతం చేసే దిశగా చేసే ప్రయత్నంలో పైలెట్ ప్రాజెక్టు కింద అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం మండలంను కో లోకేషన్ కి తీసుకోవడం జరిగిందని తెలిపారు, అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ కో లోకేషన్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలను శక్తివంతంగా తయారు చేసే విధంగా విద్యాశాఖ తో కలిసి పని చేయడం జరుగుతుందన్నారు. విద్యాశాఖలో ఉన్నటువంటి ఉపాధ్యాయుల సహకారంతో అంగన్వాడీ కార్యకర్తలు వారి పూర్వ ప్రాథమిక విద్యను చిన్నారులకు అందించడం దీనిలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని బలోపేతం చేయడమేనన్నారు. కనుక కార్యకర్తల అపోహలు వీడి విద్యాశాఖ తో కలిసి పిల్లలకి విద్యను అందించే విధంగా అడుగులు వేయాలని బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కళ్యాణదుర్గం మండలం అంగన్వాడీ కార్యకర్తలందరికీ బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ అంగన్వాడీ కేంద్ర పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారులకు ఎత్తు బరువుల్లో కచ్చితత్వం పాటించాలని సూపర్వైజర్లు దీనిని పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం మండల విద్యాశాఖ అధికారి విజయ కుమారి సూపర్వైజర్లు రాధమ్మ లక్ష్మీదేవి సుధా అరుణ రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించండి

హిందూపురం టౌన్ నవంబర్ 20 ప్రభాతవార్త

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి మండలం సిరివరం పంచాయతీలోని గౌరగానిపల్లి, మానేంపల్లి, తదితర గ్రామాల హిందూపురానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గురువారం అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు హిందూపురం ఆర్టీసీ డిపోలోని అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల నుండి ప్రతిరోజు దాదాపు 70 మంది విద్యార్థులు పాఠశాలకు వెళుతున్నారని విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో పాఠశాలకు వచ్చి పోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వైసిపి నాయకులను పెళ్లికి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

కనేకల్లు నవంబర్ 20 ప్రభాతవార్త

పెళ్లి కి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

సీనియర్ వైఎస్సార్ పార్టీ నాయకులు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్న రాజశేఖర్ రెడ్డి కుమార్తె వివాహానికి కనేకల్ పట్టణంలోని వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు జయరాం రెడ్డి కుటుంబ సభ్యులను వారి నివాసంలో కలిసి వివాహ పత్రికను అందజేసి పెళ్లికి ఆహ్వానించారు. అనంతరం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, వివాహ వేడుకను మరింత ఆనందోత్సాహాలతో నిర్వహించేందుకు అందరూ విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అభిమానులు తప్పకుండా హాజరు కావాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు జయరాం రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉషారాణి తుకారాం రెడ్డి అబ్దుల్ రాఫ్ సైకిల్ సర్మాస్ శివయ్య తదితరులు పాల్గొన్నారు

72వ అఖిలభారత అంతర్జాతీయ సహకార వారోత్సవాలు

బ్రహ్మ సముద్రం నవంబర్ 20 ప్రభాతవార్త

సహకార వారోత్సవాలు దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం సహకార సంఘం 72వ అఖిలభారత అంతర్జాతీయ సహకార వారోత్సవాలు సహకార సంఘం అధ్యక్షుడు అంకె ఓబులేసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందరూ సహకార సంఘాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతి, రైతు సంఘం అధ్యక్షులు గౌడ, డైరెక్టర్ ధనంజయ, శివమూర్తి, ఈశ్వరప్ప, పరమేష్, తదితరులు పాల్గొన్నారు సింగిల్ విండో కార్యాలయం నందు జండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అధిక లోడు వాహనాల వల్ల దెబ్బతిన్న పోలేపల్లి రోడ్డు - డి ఈ నాగేంద్ర కుమార్

బ్రహ్మసముద్రం నవంబర్ 20 ప్రభాతవార్త

వార్త ప్రభావం

వేపులపర్తినుంచి పోలేపల్లి రోడ్డు నిర్మాణం నాబార్డ్‌నిధులద్వారా పూర్తిచేయడం జరిగిందని డి ఈ నాగేంద్ర కుమార్ వివరణ ఇచ్చారు . బుధవారం వార్తా కథనంలో వచ్చిన నెల రోజులకే పాడైపోయిన పోలేపల్లి రోడ్డు అన్న శీర్షికకు స్పందించిన డిఈ నాగేంద్ర కుమార్ వార్తాపత్రికతో మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో రోడ్లు ఆ యా ప్రాంతాలకు తగిన ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని నిర్మాణం చేయడం జరిగింది. కానీ అనుకోని పరిస్థితులలో ఒక్కొక్క సారి భారీ వాహనములు అతి వేగంగా అధిక లోడ్ తో ఈ రోడ్డు మీద వెళ్ళడం జరుతున్నాయి, అటువంటి సమయంలో రోడ్డు సామర్థం కంటే అధిక లోడ్ వాహనములు అతి వేగంగా వెళ్లినప్పుడు రోడ్డు దెబ్బ తినడం జరిగిందే తప్ప, ఇందులో ఎటువంటి నిర్మాణ లోపం లేదు. రోడ్డు నిర్మాణం జరిగే సమయం లో ఉన్నత అధికారుల తనిఖీలు చేయడం జరిగింది. పాడైన రోడ్డు ను సరిచేసేలా సదరు కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్టు వివరణ తెలిపారు.

కంబదూరులో 22న గ్రామ సభ

కంబదూరు, నవంబర్ 20, ప్రభాతవార్త

కంబదూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఈనెల 22న ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీఓ శ్రీదేవి ఓ ప్రకటన రూపంలో గురువారం మీడియా తెలిపారు. జాబ్ కార్డు లేని ఉపాధి శ్రామికులు ఈ గ్రామ సభల్లో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇటీవల నిర్వహించిన ఉపాధి హామీ శ్రామికుల ఈ కేవైసీ లో సమస్యలు, తొలగించిన జాబ్ కార్డులను పునరుద్ధరించేందుకు దరఖాస్తుల స్వీకరించి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు . ఉపాధి హామీ శ్రామికులు ఈ గ్రామసభల్లో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

సొంత ఇంటి కలకై...ఇంటి నిర్మాణం కోసం సర్వే

-పనులను పర్యవేక్షించిన టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి

గోరంట్ల, నవంబర్ 20 ప్రభాతవార్త

లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాయకులు

సొంత స్థలం ఉండి ప్రభుత్వ గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకొని ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద చేపడుతున్న మ్యాపింగ్ కార్యక్రమాలను టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచు నరేష్, నిమ్మల విద్యాధరణి, గిరిధర్‌గౌడ్, అజంతుల్లా, కక్కల రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నబిరసూల్, వార్డు మెంబర్ లక్ష్మి నాగరాజు, కలీంబాష, రుషభ, వాల్మీకి సోమశేఖర్ తదితరులు ఆధ్వర్యంలో పట్టణంలోని నాల్గవ వార్డు పరిధిలో పలు లబ్ధిదారుల ఇంటి స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీలర్ నరసింహులు, అమానుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో పర్యటిస్తున్న టిడిపి నేతలు

కళ్యాణదుర్గంలో ఎరువుల దుకాణాలలో విస్తృత తనిఖీలు చేపట్టిన స్పెషల్ స్క్వాడ్ అధికారులు

18 లక్షల విలువైన సరుకులు సీజ్

నకిలీ ఎరువులు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 20 ప్రభాతవార్త

అనుమతి లేని ఎరువుల తనిఖీ

కళ్యాణదుర్గం పట్టణంలో గత కొంతకాలంగా సాగుతున్న ఎరువుల దుకాణాల దందాకు చెక్ పెడుతూ స్పెషల్ స్క్వాడ్ అధికారుల బృందం గురువారం స్థానిక అధికారులతో కలిసి విస్తృత తనిఖీలను చేపట్టారు రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు తాడిపత్రి వ్యవసాయ సహాయ సంచాలకులు రవి ఆధ్వర్యంలో స్పెషల్ స్క్వాడ్ బృందం కళ్యాణదుర్గం పట్టణంలో ఎరువుల దుకాణాలలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు గాంధీ చౌక్ సెంటర్ నందు గల లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో మరియు వారికి సంబంధించిన నాలుగు గోడౌన్లలో తనిఖీలు నిర్వహించి గడువు ముగిసిన వివిధ కంపెనీలకు చెందిన ఫారం ఓ లేని సరుకును శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ 6.75 మెట్రిక్ టన్నులు గల వాటి విలువ 15 లక్షల 24 వేల రూపాయలు సరుకును సీజ్ చేసినట్లు వారు తెలిపారు అలాగే ముదిగల్లు రోడ్డు లోపల మన గ్రోమోర్ కేంద్రం నందు తనిఖీలు చేసి 465 లీటర్ల వివిధ రకాల ద్రవ ఎరువులను వాటి విలువ మూడు లక్షల 30 వేల రూపాయలు సరుకును సీజ్ చేసినట్లు వివరించారు ఈ సందర్భంగా పనికి బృందం అధికారి రవి మాట్లాడుతూ రైతులు ఎవరు నకిలీ విత్తనాలు నకిలీ ఎరువుల వల్ల మోసపోకూడదు అని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రైతులు ఎరువుల దుకాణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏది కొన్న వాటికి సంబంధించిన బిల్లులను రసీదులను కచ్చితంగా పొందాలని సూచించారు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ తనిఖీ బృందం అధికారులతో పాటు స్థానిక ఏ డి ఏ ఎల్లప్ప మండల వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ఎంపీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు ఏది ఏమైనప్పటికీ కల్యాణదుర్గం నందు గత కొంతకాలంగా సాగుతున్న ఎరువుల దుకాణదారుల దందాకు పుల్ స్టాప్ పడేవిధంగా అధికారులు వ్యవహరించడం పట్ల హర్షం వ్యక్తం అవుతుంది.



సరుకులను సీజ్ చేస్తున్న స్క్వాడ్ అధికారుల బృందం

లేపాక్షి ఫోటో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

చిలమత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త

ఆర్థికసాయం అందచేస్తున్న దృశ్యం

చిలమత్తూరు మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ గత నెలలో బాగేపల్లి వద్ద ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో గాయపడగా కాలుకు ఆపరేషన్ చేశారు. కాలు కింది భాగం తీసివేయడం జరిగింది. ఈ సందర్భంగా మరవకొత్తపల్లి గ్రామానికి వెళ్లి లేపాక్షి ఫోటో అసోసియేషన్ తరపున ఆయనను పరామర్శించి ఆయన కుటుంబానికి భరోసా కల్పిస్తూ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫోటో అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్,ఉపాధ్యక్షుడు సందీప్, సెక్రటరీ నాగరాజు, రాజు, రామలింగ, రామచంద్ర, ఉమేష్, రాజారెడ్డి,పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చిలమత్తూరు. నవంబర్ 20 ప్రభాతవార్త

విద్యార్థులకు బహుమతులు అందచేసిన దృశ్యం

చిలమత్తూరు మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20తేదీవరకు వారం రోజులు నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీపొట్టి శ్రీరాములు జెడ్‌పి హైస్కూల్ పాఠశాలలో వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు శేషాద్రి, శేఖర్, విశ్వనాథ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలలో గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున, హెచ్ఎం శశికళ, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పురానికి రూ.15 కోట్ల విడుదల

హిందూపురం నవంబర్ 20 ప్రభాతవార్త

వివరాలు వెల్లడిస్తున్న పిఏ వీరయ్య, రమేష్

హిందూపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు అహుడా కింద 15 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏ వీరయ్య, మున్సిపల్ చైర్మన్ రమేష్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పత్రిక ప్రకటన విడుదల చేశారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ కృషితో రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి పుర అభివృద్ధి కోసం మరో 15 కోట్ల రూపాయలు విడుదల చేయించారని చెప్పారు. నేడు పరిపాల అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇటీవలే 92.5 కోట్ల రూపాయలను మంజూరు చేయించిన ఎమ్మెల్యే వెంటనే ఇప్పుడు 15 కోట్ల రూపాయలు విడుదల చేయించారని చెప్పారు. గాంధీ సర్కిల్ నుండి బాలాజీ సర్కిల్ వరకు 40 అడుగుల రోడ్డు, డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంబాలు లైటింగ్, బాలాజీ సర్కిల్ నుండి ధర్మపురం బైపాస్ 40 అడుగుల రోడ్డు మరియు డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంబాలు లైటింగ్, రైల్వే రోడ్డు లో డివైడర్స్, విద్యుత్ స్తంబాలు లైటింగ్ ఏర్పాటు జరుగుతుందన్నారు.

ఈ నెల 23న ప్రభుత్వ విప్ యనమల దివ్య రాక

పుట్టపర్తి (కలెక్టరేట్), నవంబర్ 20, ప్రభాతవార్త

యనమల దివ్య (ఫైల్‌ఫోటో)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య ఈ నెల 23న భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు పుట్టపర్తి రానున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఆమె ఈ నెల 22న రాత్రి 09:05 గంటలకు హైదరాబాద్‌లోని కాచీగూడ నుండి యలహంక ఎక్స్‌ప్రెస్ రైలు నందు బయలు దేరి 23వ తేదిన ఉదయం 06:40 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ చేరుకుంటారన్నారు. అక్కడి నుండి రోడ్డు మార్గం గుండా ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథిగృహంనకు ఉదయం 07:00 గంటలకు చేరుకొని ఉదయం 08:30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారన్నారు. అనంతరం 08:35 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని జయంతి వేడుకల్లో పాల్గొంటారని, ఉదయం 10:00 గంటలకు తిరిగి శాంతి భవన్ అతిథి గృహంనకు చేరుకొని విశ్రాంతి తీసకోవడం జరుగుతుందన్నారు. సాయంత్రం 06:00 గంటలకు ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌కు బయలుదేరి, 06:27 గంటలకు కాచీ గూడ ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగు ప్రయాణం కానున్నట్లు తెలియజేశారు.

అయ్యప్పలకు నిత్య ఫలహారం ప్రారంభం

హిందూపురం టౌన్ నవంబర్ 20 ప్రభాతవార్త

పలహారం వడ్డిస్తున్న దృశ్యం

పట్టణంలోని పాండురంగనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం లో మాలధారణ అయ్యప్పలకు రాత్రి పలహారం సందర్భంగా ప్రారంభించారు. దేవాలయము కమిటీ అధ్యక్షులు బాలచంద్ర, కార్యదర్శి మేడం వరప్రసాద్, కోశాధికారి కట్ట రమేష్, గురుస్వామి ప్లేట్ల వెంకటేష్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బెంగళూరు రోడ్లో ఉన్న అయ్యప్ప దేవాలయంలో మధ్యాహ్నం వేళలో అయ్యప్ప భక్తులకు అన్న సంతర్పణ భిక్ష ప్రారంభించగా, రాత్రి ఈ ఆలయంలో పలహారం అందించడం భక్తులకు ఎంతో సౌకర్యంగా మారింది. దాతలు విరివిగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుంతకల్లు, నవంబర్ 20 ప్రభాతవార్త

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. వారం రోజుల పాటు పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీదేవి, ప్రభుత్వ వైద్యురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా వార్తాపత్రికలు చదవడం వలన సామాజిక పరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. సెల్ ఫోన్‌కు దూరంగా ఉంటూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని వారు కోరారు. అనంతరం గ్రంథాలయ అధికారిని కే.సుజాత వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

విద్యం, వైద్యం ప్రైవేటీకరణ అత్యంత ప్రమాదకరం..!

-చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోవాలి

-మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

-మెడికల్ కాలేజీల ప్రైటీకరణకు వ్యతిరేకంగా ఉరవకొండలో కోటి సంతకాల సేకరణ

ఉరవకొండ, నవంబర్ 20 ప్రభాతవార్త

ఉరవకొండలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విద్య, వైద్యం ప్రైవేటీకరణ అత్యంత ప్రమాదకమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవైటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా గురువారం ఉరవకొండ పట్టణంలోని బాలాజీ సినిమా హాల్ ప్రాంతంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా ప్రజల నుండి మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దెబ్బదీస్తోందన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 8,480 కోట్ల రూపాయలతో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు శ్రీకారం చుట్టారన్నారు. 10,032 విలేజ్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అక్కడే చేయించారని, 399 కో

రేపు జిల్లా స్థాయి నైపుణ్య పోటీలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 20 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని ఒకేషనల్ కోర్సు నిర్వహిస్తున్న 73 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లాస్థాయి వివిధ విభాగాల నైపుణ్య పోటీలు రేపు (శనివారం) కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం బుక్కరాయసముద్రంలో నిర్వహిస్తున్నందున తమ పాఠశాల స్థాయిలో ఎంపిక కాబడిన విద్యార్థులను, ఒక్కొక్క ఒకేషనల్ ట్రైనర్ ద్వారా రెండు నమూనాలతో జిల్లా స్థాయి ప్రదర్శనకు తీసుకు రావలసిందిగా అదనపు పథక సమన్వయకర్త సమగ్ర శిక్ష వారు తెలియజేశారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 20 ప్రభాతవార్త

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మాక్ అసెంబ్లీ నిర్వహణకు నియోజకవర్గ స్థాయి కాంపిటీషన్స్‌లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులలో ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర స్థాయికి ఎంపిక కమిషనర్ కార్యాలయం నుంచి రాష్ట్ర స్థాయికి మాక్ అసెంబ్లీకి ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శాసనసభ నిర్వహించే విధానం గురించి ఎంపికైన విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ప్రతిపక్షంలోనో, విపక్షంలోనో, ఎమ్మెల్యేలుగానో ఏదో ఒక రూపంలో ఉంటారు. ఆ శాఖలకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులతో రూపొందించుకోవాలి. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులు, అభివృద్ధి, సమస్యలు, నివారణోపాయాలు, ముఖ్యంగా సొంత నియోజకవర్గానికి సంబంధించినవి ఇలా అన్ని విషయాలపై తర్ఫీదు ఇవ్వాలి.

రిటైర్డ్ టీచర్ వెంకట రమణ మృతి

తలుపుల, నవంబర్ 20 ప్రభాతవార్త

వెంకటరమణ (ఫైల్‌ఫోటో)

తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కదిరిసాని వెంకటరమణ అలియాస్ ఏటన్న అయ్యవారు(83) గురువారం గంజివారిపల్లిలోని తన స్వగృహంలో అనారోగ్యంతో తుది శ్వాస విడిచాడు. ఈయన గతంలో ఈదులకుంట్లపల్లి, జ్యోతి వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ల్లో పనిచేసి కొత్త పూలవాండ్లపల్లిలో పదవీ విరమణ చేశాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈయన మనవరాలు ఈయన పదవీవిరమణ చేసిన పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా పనిచే యడం విశేషం. అంత్యక్రియలు గంజివారి పల్లి గ్రామంలో రేపు జరుగు తాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

తమను బ్లాక్ మెయిల్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారు
- నా భర్త ఆచూకీ తెలియజేయండి.. సార్

అనంతపురం కల్చరల్, నవంబర్ 20 ప్రభాతవార్త

మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు

తన భర్త శ్రీరాములను కిడ్నాప్ చేశారని, జిల్లా ఎస్పీ న్యాయం చేయాలంటూ కోవూర్ నగర్‌కు చెందిన పుష్ప శ్రీరాములు అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో గురువారం విలే కరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అనంతపురం లోని కోవూర్ నగర్‌కు చెందిన పుష్ప శ్రీరాములు గత కొన్ని ఏళ్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. కల్పవృక్ష డెవ లప్మెంట్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసి, వివిధ ప్రాజెక్టుల ద్వారా వచ్చిన లాభాలలో తమ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారికి వచ్చిన లాభాల్లో సగం వాటా.. ఇస్తూ వచ్చా మన్నారు. ఇలా కొందరు తమకు ఇవ్వా ల్సిన డబ్బు ఇవ్వలేదంటూ.. తప్పుడు ఆరోపణలు చేశారని వాపోయారు. తాము వారికి చెల్లించిన డబ్బును రికార్డులతో సహా తమతో ఉన్నాయన్నారు. వారికి చెల్లించిన ప్రతి రూపాయి బ్యాంక్ ద్వారానే చెల్లించామని తెలియ జేశారు. కేవలం రూ.15లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కోట్ల ఇవ్వాలంటూ నిత్యం ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై కర్ణాట కలోనూ కేసులు నమోదు చేశారని, వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇస్తామన్న తన భర్త శ్రీరాములను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఇంటికి కొంతమంది వచ్చి తన భర్త శ్రీరాములను కిడ్నాప్ చేసి బలవంతంగా తీసుకెళ్లారన్నారు. ఇప్పటివరకు తన భర్త ఆచూకీ తెలియటం లేదని, దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. జిల్లా ఎస్పీ తనకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తమపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం కింద కేసు నమోదు చేస్తానని ఆమె హెచ్చరించారు.

తెలుగులో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

అనంతపురం, నవంబర్ 20 ప్రభాతవార్త బ్యూరో

ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

2024-25 పబ్లిక్ పరీక్షలలో తెలుగులో అత్యుత్తమ మార్కులు వచ్చిన (97 నుండి 100 మార్కులు) వచ్చిన విద్యార్థులకు సెయింట్ ఆన్స్ ప్రిన్సిపల్ సిస్టర్ సెల్వా మేరీ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహిత్య సామా జిక సేవా సంస్థ అధ్యక్షులు తాడిపత్రి వెంకట రెడ్డి, కళాభూషణ్, డాక్టర్ అంకె రామలింగమయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి స్వయంగా సంస్థ ద్వారానే విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రశంసా పత్రము, మెడల్స్, పుస్తకాలను జ్ఞాపికలుగా విద్యార్థులందరికీ బహుకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాడిపత్రి వెంకట రెడ్డి, కళాభూషణ్ డాక్టర్ అంకె రామలిం గమయ్య విద్యార్థులు చద వడం మీ హక్కు దాని వినియోగించుకోవాలి అత్యుత్తమ స్థానాన్ని సంపాదిం చుకోవాలని ఎంతో చక్కగా పద్య, గేయ, గాన రూపంలో విద్యార్థులకు ఉపన్యసించారు. అతిథులుగా విచ్చేసిన తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు తాడిపత్రి వెంకటరెడ్డి, కళాభూషణ్ డా.అంకె రామలింగమయ్య, ప్రముఖ కవి, రచయితల గురించి పాఠశాల చిన్నారులు తెలుసుకుని, పద్య, గాన, గేయంతో ప్రతి ఒక్కరిని అలరించి, ఇక్కడికి రావడం ఎంతో గర్వకారణం అని గొప్పగా ఉపన్యాసించారు. ఈ సందరర్భంగా సెయింట్ ఆన్స్ ప్రిన్సిపల్ సిస్టర్‌కి, తెలుగు ఉపాధ్యాయిని గాయత్రికి సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కాలభైరవుని చెంత భక్తి శ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం
- అమావాస్య గడియల్లో భక్తులచే అభిషేకం, దీపోత్సవం
- రెండు రోజుల పాటు పూజలు, భక్తులకు అన్నదానం

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కూష్మాండ దీపాలను వెలిగిస్తున్న మహిళలు

అనంతపురం, నవంబర్ 20 ప్రభాతవార్త బ్యూరో

ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో కూష్మాండ దీపోత్స వం వైభవంగా సాగింది. పట్టణం లోని లక్ష్మి చక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు రెండు రోజుల పాటు నిర్వహించారు. ధర్మవరం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమావాస్య గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ్ ఆచారి దోష నివారణ పూజలు చేశారు. స్వామివారికి భక్తులచే అభిషేకాలు నిర్వహించారు. ప్రదోష కాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్స వాన్ని ప్రారంభించారు. అనంతరం కంకణదారణ కార్యక్రమం కూడా జరిగింది. గురువారం ఆలయ పూర్వపు పూజారి శ్రీరాములు ఆచారి శివైక్యం చెందిన రోజు కావడంతో కుంటిమద్ది వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

పిపిపి విధానానికి అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నారు
- వైసిపి కోటి సంతకాల విజయవంతమే ఇందుకు నిదర్శనం
- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 20 ప్రభాతవార్త

కోటి సంతకాల కాపీలను వైసిపి జిల్లా అధ్యక్షులు అనంతకు అందిస్తున్న విద్యార్థి విభాగం నేతలు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పిపిపి విధానానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థి విభాగం నేతలు సేకరించిన సంతకాల పేపర్లను వైసిపి జిల్లా అధ్యక్షులు అనం త వెంకటరామిరెడ్డికి గురువారం అందజేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణ వల్ల జరిగే నష్టాన్ని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నేతలు పలు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వివరించారు. దాదాపు 14వేల సంతకాలను పిపిపికి వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి వారు సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి విభాగం నేతలు సమిష్టిగా పని చేసి విద్యార్థులలోకి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల జరిగే నష్టాన్ని సమర్థవంతంగా తీసుకెళ్లారని అభినందించా రు. ఇదే స్ఫూర్తితో కూటమి ప్రభు త్వంలో విద్యా విధానంలో అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలని సూచించారు. పిపిపి వి ధానానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమం విజయ వంతం అవుతుండటమే ఈ విధానానికి ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రాయల్, ప్రధాన కార్యదర్శి సాయి నితిన్, నగర అధ్యక్షులు కైలాష్, నగర విభాగం నేతలు శివ, పులికార్తికేయ, ఫయాజ్, నరేందర్‌రెడ్డి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

చదువే అన్నింటికీ మూలం
- ఘనంగా ముగిసిన 58వ గ్రంథాలయ వారోత్సవాలు

సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారిణి వెంకటలక్ష్మి

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం.

పామిడి, నవంబర్ 20 ప్రభాతవార్త

చదువే అన్నింటికీ మూలమని చదువు లేకపోతే బ్రతుకులన్నీ సున్నాగానే మిగిలిపోతాయని అందువల్ల విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్య శించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు విద్యనం దించిన గురువులకు మంచి గుర్తింపును తీసుకురావాలని టిసి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటలక్ష్మి, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథ్, గ్రంథాలయ కమిటీ సభ్యులు గాధిలింగగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 14న ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశను ఏకాగ్ర తతో పుస్తక పఠనాన్ని అలవర్చు కోవాలన్నారు. చదువే భవిష్యత్తుకు మార్గాన్ని చూపిస్తుందని విద్యార్థులంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెం పొందించుకుంటూ దేశాభివృద్ధికి తోడ్పాటును అందించాలని తెలిపారు. గ్రంథాలయ అధికారిణి వెంకటలక్ష్మి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వార అనంతమైన విజ్ఞానాన్ని పొందవచ్చని తెలియజేశారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండా గారాలని ప్రతిఒక్కరూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదవాలని కోరారు. అనంతరం గ్రంథాలయ వారోత్స వాలను పురష్కరించుకుని నిర్వహించిన పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమకా రులను స్మరించుకునుట, కవులు రచయితల గురించి చర్చా వేదిక, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు, మహిళా సాధికారిత పోటీల్లో అత్యంత ప్రతి భను కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇదిలావుండగా గ్రంథాలయానికి వస్తున్న 10 విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమశేఖర్ పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, సుబ్రమణ్యం, సురేష్, ఆయా పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్ మంజూరు చేయండి

శింగనమల, నవంబర్ 20 ప్రభాతవార్త

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో మాట్లాడుతున్న మౌనిక

మండల పరిధిలోని పి.జలాలపురం గ్రామానికి చెందిన మంచాల మౌనిక తనకు పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరారు. గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పి.జలాలపురం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీకి వచ్చిన సందర్భంగా మౌనిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి తన భర్త మంచాల ధనాంజినేయులు ఆరు నెలల క్రితం గుండె పోటుతో మృతి చెందారని, తనకు ఇద్దరు చిన్న పిల్లలు అని, చిన్న పిల్లలను తీసుకుని పనికి వె ళ్లడానికి కష్టంగా ఉందని, దయచేఏసి ప్రభుత్వం స్పందించి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంచాల మౌనికతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తోందని, గత వైసిపి ప్రభుత్వంలో అర్హత లేకున్నా అనేక మంది నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారని ఆరోపణలు రావడంతో నకిలీ పింఛన్లపై విచారణ జరుపుతున్న సందర్భంగా నూతన పింఛన్లు మంజూరు చేయడం కొద్దిగా ఆలస్యమైందని, త్వరలోనే నూతన పింఛన్లు మంజూరు అయిన వెంటనే మీకు పింఛన్ మంజూరు చేస్తామని ఆమెకు భరోసానిచ్చారు. అనంతరం పంచాయితీ కార్యదర్శి ఎంపిడిఓ భాస్కర్‌కు ఆమె వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శాలిని, ఆమె వెంట టిడిపి సీనియర్ నాయకులు గోరంట్ల మారుతినాయుడు, మండల కన్వీనర్ గుత్తా ఆది నారాయణ, టిడిపి జిల్లా అధి కార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మాసుల్ చంద్రమోహన్, ప్రసా ద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అమలు చేయండి
- సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్ - చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి నేసే మధు

శింగనమల, నవంబర్ 20 ప్రభాతవార్త

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మండలకేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి సీపీఐ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్‌చేనేత మండల కార్యదర్శి నేసే మధు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

చేనేత కార్మికులకు ఎన్నికల హామీలు ఇచ్చిన సందర్భంగా 200యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని, నేతన్న నేస్తం కింద ప్రతి చేనేత కుటుంబానికి 25వేల రూపాయలు వారి ఖాతాలకు జమా చేయాలని, ఆదరణ 3.0 పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి పనిముట్లు అందించాలని 90శాతం సబ్సిడితో బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. వెంటనే ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు సిపిఐ మండల సహాయ కార్యదర్శి చికెన్ బాషా, సి.రాధకృష్ణ, ఎస్.శివశంకర్, రామాంజి నేయులు, మధురెడ్డి, రవిరెడ్డి, హరి, చంద్ర, భయన్న, నర్సయ్య, దస్తగిరి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించి గ్రామస్తులకు న్యాయం చేస్తాం - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, నవంబర్ 20 ప్రభాతవార్త

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మండల కేంద్రంలోని దుర్గాంజినేయ స్వామి కొండపై ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులు గురువారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పని చేస్తున్న పూజారి నిబంధనలు పాటించడం లేదని, భక్తులకు సరైన సమయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదని, ఆలయం పరిశుభ్రంగా ఉంచడం లేదని వెంటనే ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యను తెలుసుకున్న ఎ మ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వారి వద్దకు వెళ్లి వారితో వినతి పత్రం స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లా డుతూ.. దుర్గాంజినేయ కొండపై నెలకొన్న సమస్య తమ దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపి, గ్రామస్తులకు న్యాయం చేస్తామని తెలిపారు. నిరసన తెలిపిన వారిలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎన్.ఆదినారాయణ, శింగనమల ఆయక్‌ట్టు సంఘం అధ్యక్షులు జి.సత్యనా రాయణ, టిడిపి సీనియర్ నాయకులు సి.వెంకటేష్, వీరనారాయణ, వీరాంజినేయులు, మొబ్బు, నగరూరు పెద్దన్న, చిరంజీవి, గురుమూర్తి, వడ్డే ఆంజినేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలను ప్రైవేటుపరం నిరసిస్తూ... రుద్రంపేట పంచాయతీ లో సంతకాల సేకరణ.

అనంతపురం రూరల్, నవంబర్ 20 ప్రభాత వార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీ లను ప్రభుత్వం మంజూరు చేసిందని వేగ వంతంగా నిర్మాణాలు సైతం దాదాపు పూర్తి చేసిందని అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కాలేజీ లను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు చేస్తోందని అందుకు నిరసనగా ప్రజల నుంచి కోటి సంతకాలకు నాంది పలికామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ మహబూబ్ బీ, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ లోని పంతుల కాలనీలో వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీటీసీ మహబూబ్ బీ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసే కుట్రను మానుకోకపోతే ప్రజల సహకారంతో ప్రభుత్వంపై తిరుగుబాటు తెస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎస్ పంచాయతీ రాజు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాదిక్ వలి, వార్డు సభ్యురాలు సుభద్రమ్మ,షేక్ షా వలి, , వెంకట్రాముడు, కాజా, షాషావలి, అక్కమ్మ, జయమ్మ., ఆరిఫా, సిమ్మి,నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

రుద్రంపేట లో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం.

సిఆర్ఎంటిలను,స్థానికంగాక్లస్టర్లలో కేటాయించాలి

జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న సిఆర్‌టిలు

కూడేరు, నవంబర్ 20 ప్రభాతవార్త

సమగ్రశిక్షలో గత 13 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ మొబైల్ రిసర్స్ట్ టీచర్లను స్థానిక మండలం, స్థానిక క్లస్టర్లలో కేటాయిం చాలని సిఆర్పిల సంక్షేమ సంఘం జిల్లా విద్యా శాఖ అధికారికి వినతిపత్రం ద్వారా మనవి చేశారు. సిఆర్పిల నియామకం స్థానిక క్లస్టర్ పరిధి, మండల పరిధిలో నియమించడం జరిగిందని. నేడు క్లస్టర్లను కుదించడంతో మిగిలిన సిఆర్ఎంటిలను సుదూర ప్రాంతాలకు దాదాపు నూరు నుంచి 150 కిలోమీటర్ల దూరం ఉన్న మం డలాల క్లస్టర్ కేటాయిస్తూ అధికారులు సన్నాహాలు చేస్తున్నడంతో వారు ఒక్కసారిగా తీవ్ర ఇబ్బందులకు గురై గురువారం అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారికి వారి ఆవేదన వ్యక్తం చేయడం జరిగినది. ప్రభుత్వం నుండి గౌరవ వేతనం తప్ప ఎటువంటి అల వెన్సులు మాకువర్తించక పోవడ ంతో పాటు, సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయడం చాలాకష్ట తరం గా మారిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, నరసిం హమూ ర్తి, నాగేంద్ర, విద్య, రామాంజనమ్మ, వెంకటరమణ, లాజరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇప్పేరు చెరువు నుండి నాగిరెడ్డిపల్లికి పిల్ల కాలవదారా నీరు విడుదల..
- కృతజ్ఞతలు తెలియజేసిన నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు.

ఇప్పేరు చెరువు నుండి తూము ద్వారా నీరును విడుదల చేసిన దృశ్యం

కూడేరు, నవంబర్ 20 ప్రభాతవార్త

కూడేరు మండలం ఇప్పేరు చెరువు నుండి నాగిరెడ్డిపల్లి గ్రామనకు పిల్ల కాలువ ద్వారా నీరును విడుదల చేయడంతో నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పేరు చెరువు నుండి పి.నాగిరెడ్డిపల్లి చెక్ డ్యామ్‌లకు నీరు విడుదల చేయడం, పశువులకు గొర్రెలకు, రైతుల బోరుబావులకు ఎంతో మేలు జరుగుతుందని, పి.నాగిరెడ్డిపల్లి, గ్రామప్రజలు పయ్యావుల సోదరులకు ఎంతో రుణపడి ఉంటాము అని తెలియజేశారు.

జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 20 ప్రభాతవార్త

ఉమ్మడి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.రామసుబ్బారెడ్డిని బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ నెల 11న నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నేషనల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు గర్వకార ణంగా, రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్టేట్ లెవెల్ ఉర్దూ టీచర్స్‌గా ఏడు మంది ఉపా ధ్యాయులు ఎంపికయ్యారు. అలాగే జిల్లా స్థాయిలో కూడా పలువురు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయులు గుర్తింపు పొందారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ అత్యంత శ్రద్ధతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలకు ఆయన స్వయంగా సన్మానం చేయడం విశేషం. రాష్ట్ర స్థాయి బెస్ట్ ఉర్దూ టీచర్ అవార్డులకు మెహతాజ్, ఎస్. బాబ్జాన్, చిలుకల జయమ్మ, ఆబిదా, సాయి రా, జవేరియా భాను ఎంపిక య్యారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ రేంజ్) దావూద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి ఘన సత్కారం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం నవంబర్ 20 ప్రభాతవార్త

రానున్న సార్వత్రిక ఎన్నికలలో పదవ క్లస్టర్ నందు అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ నగర అధ్యక్షుడు, పదవ ఇంచార్జ్ కాయగూరల శ్రీధర్ తెలిపారు. అనంతపురం నియోజకవర్గ 10వ క్లస్టర్ ఇంచార్జ్ గా తనను నియమించినందుకు అనంత పురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు శ్రీధర్ కృతజ్ఞతలు తెలియజేశారు. 10వ డివిజన్ యూనిట్, కో యూనిట్, బూత్ కమిటీ సభ్యులతో కలిసి అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ అర్బన్ టిడిపి కార్యా

04ATP20_04ATP20.qxd 20-11-2025 PM 11:01 Page 1

పక్కా ఇల్లు కోసం ఈ నెల 30లోగ దరఖాస్తు చేసుకోండి

పేదలకు ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం నవంబర్ 20 ప్రభాతవార్త

ఇల్లు లేని పేదలు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. 2029 నాటికి ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేరుస్తామని స్పష్టం చేశారు. రాయదుర్గం ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం ఆయన రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ... 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని వెల్లడించారు. అందుకు అను గుణంగా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు తెలియజేశారు. రాయ దుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 7518 మంది ఇంటి కోసం దరఖా స్తులు చేసుకున్నారని వివరించారు.

అందులో ఇంటి స్థలాలు కలిగిన వారు 4799 మంది కాగా, ఇంకా పట్టాలు రానివారు 2749 మంది ఉన్నారన్నారు. ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాల్సిన వారందరితో కలిపి దాదాపు 3వేల మందికి డిసెంబర్లో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. ఓ పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వ హిస్తామన్నారు. సొంత ఇల్లు అవసరమైన పేదలందరూ ఈ నెలాఖరులోగా సంబంధిత గ్రామ సచివాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆ తర్వా త గడువు పెంపు ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. కావున సొంత ఇల్లు కావాలనుకున్నవారు గడు వులోగా తమ దరఖాస్తులు సమర్పించాలన్నారు. వారందరికీ దశలవారీగా ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరు గుతుందన్నారు. ఆర్థికే తర స మస్యలను వేగం గా పరిష్కరి ంచాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆర్డిఓ ఆధ్వర్యంలో

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నియోజకవర్గ పరిదిలోని తాసిల్దార్లతో నిర్వహించిన సమావేశంలో రెవిన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టా లని అధికారులకు ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిన్నర కాలంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవంతో పాటు వివిధ సం దర్భాల్లో ప్రజల నుంచి 4746 ఫిర్యాదులు స్వీకరిం చానన్నారు. పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు వాటిని సిఫార్సు చేయగా, 4016 పరిష్క రించినట్లు వివరించారన్నారు. ముఖ్యంగా తనకు అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే అత్యధికంగా 70 నుంచి 75 ఉన్నాయన్నారు. రె వెన్యూ అధికారులు సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కా రానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోని ఆర్థికేతర సమస్యలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

రెండు రాష్ట్రాల మధ్య రహదారులను అనుసంధానం చేయండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి - పుట్టపర్తిలో సహచర ప్రజాప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రితో భేటి - అనంతపురం ఎగువపల్లి రోడ్డు విస్తరణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావన - కుటుంబ సభ్యులతో కలిసి బాబా మహాసమాధిని దర్శించుకున్న సునీత

రామగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని రహదారిని కర్ణాటకతో అనుసంధానించేలా విస్తరించాలని కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్య సాయిబాబా వారి శతజయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తి వచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సహచర ప్రజా ప్రతినిధులతోపాటు ఆయనతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. అలాగే గత కొన్ని సంవత్సరాలనుంచి సమస్యగా ఉన్న అనంతపురం ఎగువపల్లి రహదారి గురించి ప్రత్యేకంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురం నుంచి తగరకుంట మీదుగా ఎగువపల్లికి వెళ్లే రోడ్డు తగరకుంట నుంచి ఎగువపల్లి వరకు 20కిలోమీటర్లు రోడ్డును ఐ.ఎస్.సి పథకం క్రింద డబుల్ లైన్‌గా విస్తరించాలన్నారు. ఇందు కోసం రూ.35కోట్ల నిధులు అవసరమవుతాయని.. వాటిని మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి విస్తరణ వలన ఇటు ఏపీ, అటు కర్ణాటక ప్రాంతాల్ని అనుసంధానం చేసినట్టు అవుతుందన్నారు. దీనిపై కేంద్ర మం త్రికి వినతి పత్రం ఇవ్వగా.. ఆయన సానుకూలంగా స్పం దించారు. అధికా రులతో మాట్లాడి నిర్ణయం తీసుకు ంటామని హామీ ఇచ్చారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత తన కుటుంబ సభ్య లతో కలిసి భగ వాన్ శ్రీ సత్యసాయి బాబా మహా సమా ధిని దర్శించుకు న్నారు. సాయి కుల్వంత్ మం దిరంలోని మహా సమాధి చెం త నిర్వహించిన కార్యక్రమా లలో వారు పాల్గొన్నారు. తమ కుటుంబ సభ్యులకు బాబా అంటే ఎంతో ఇష్టమైన దైవంగా కొలుస్తు న్నారన్నారు. ఆ మహా నీయుని శత జయంతి వేడుకల్లో మహా సమాధిని దర్శించుకోవడం చాలా అనందంగా ఉందన్నారు.

కేంద్ర మంత్రి నితిన్ గట్కారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

- వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తాం - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, నవంబర్ 20 ప్రభాతవార్త

ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. గురు వారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం ఆవరణంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తామని దాదాపు 165 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చినట్లు ఆమె తెలిపారు. గ్రామాలలో మౌలిక వసతులు ఏర్పాటుకు అధికా రులు కృషి చేయాలని ముఖ్యంగా ప్రజా దర్బార్‌లో రీ సర్వే సమస్య లు ఎక్కువగా వస్తున్నాయని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను తమ కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోందని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి శాలిని దొర, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్ విండో చైర్మన్ గుర్రం లక్ష్మినా రాయణ, నాయీబ్రా హ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినా రాయణ, సింగన మల ఆయకట్టు సంఘం అధ్యక్షులు జి.సత్య నారాయణ, టిడిపి సీనియర్ నాయకులు గోరంట్ల మారుతినాయుడు, మాసుల్ చంద్రమో హన్, సి.వెంకటేష్, ఉల్లికల్లు రంగారెడ్డి, రహంతుల్లా, దండు విజయ్ కుమార్, తరిమెల పెద్దిరెడ్డి, ముంతా వెంక టేష్, నాగముని, పెరవలి సర్పంచు రాజు, కోయగూ ర పెద్దన్న, తహశీల్దారు శేషారెడ్డి, ఎంపి డిఓ భాస్కర్, పంచాయితీ రాజ్ డిఇ జ్యోతి, డిప్యూటీ తహశీల్దారు సురేష్‌బాబు, రీ సర్వేయర్ డిప్యూటీ తహశీల్దారు నారా యణ స్వామి, సిడిపిఓ చెల్లాలలి త, విద్యుత్‌శాఖ ఏడి రఘు, ఏఈ సుదర్శన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్ కుమార్, హార్టికల్చర్ అధికారి శైలజా, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ విజయ్ కుమార్, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజా దర్బార్‌కు హాజరైన ప్రజలు, అధికారులు

జాతీయ రహదారుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించండి

-ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి టౌన్,నవంబర్ 20, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రానికి అనుసంధానంగా జాతీయ రహదారులను నిర్మాణం చేపట్టాలని, నిర్మాణంలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయిం చాలని కేంద్ర జాతీయ రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. శ్రీ సత్యసాయి బాబా మహా సమాధి దర్శనం అనంతరం శ్రీనివాస గెస్ట్ హౌస్ లో సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులు,రాష్ట్ర రహదారుల ప్రగతిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, సత్యకుమార్, ఆర్అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు నూతన జాతీయ రహదారుల ఏర్పాటుపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర , మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత,ఎంఎస్ రాజు తదితరులు ఆయా నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితి పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సత్యసాయి జిల్లాలో పెనుగొండ జాతీయ రహదారి 44 నుంచి కొత్తచెరువు ,పుట్టపర్తి, నల్లమాడ, ఓడి చెరువు మహమ్మదా బాద్ క్రాస్ , సిజి ప్రాజెక్టు, కొక్కంటి క్రాస్ వరకు కదిరి టు చెన్నై జాతీయ రహదారికి కల పాలని కేంద్ర మంత్రిని ఎమ్మె ల్యే పల్లె సింధూర కోరారు. పు ట్టపర్తి నియోజకవర్గంలో నూత న ఆర్అండ్ బి రోడ్లు మరియు పాడైన బీటీ రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టే విధంగా నిధులు కేటాయించాల ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మ ంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతి ప త్రం అందజేశారు. నియోజకవర్గంలో రహదారులు లేని వాటి వివరాలను ఎమ్మె ల్యే పల్లె సింధూర మంత్రికి లేఖ సమర్పించారు. పుట్టపర్తి నియోజ కవర్గంలో రహదారుల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు తప్పకుండా అంది స్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తోపాటు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు.



కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నీ చుట్టూ ముట్టిన నేతలు

పోటాపోటీగా వినతి పత్రాలు సమర్పణ

మా నియోజకవర్గాల్లో రోడ్ల గురించి చూడండి అంటూ వినతులు

ఆయా నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించాలంటూ జాతీయ హైవేల శాఖా మంత్రిని కోరుతున్న మంత్రులు, ఎంఎల్‌ఏలు

అనంతపురం, నవంబర్ 20:(ప్రభాతవార్త బ్యూరో)

దేశ ప్రధాని నరేంద్ర మోది పుట్టపర్తి పర్యటన ముగిసిన మరుసటిరోజే శ్రీ సత్యసాయి కేంద్రం అయిన పుట్టపర్తి కి కేంద్ర రోడ్లు, రవాణా జాతీ య హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని మం త్రులు, శాసనసభ్యులు, ఇతర టిడిపి నేతలతో పాటు బిజెపి నేతలు కూడా నితిన్ గట్కరిని కలిశారు.. ఈ సందర్భంగా పోటాపోటీగా ప్రజా ప్రతినిధులు తమ తమ నియోజకవర్గాల్లో రోడ్ల గురించి వినతి పత్రాలు సమర్పించుకొని తమ ప్రాంతములో రహదారు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విన్నవిం చుకో వడం విశేషం. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి నాయకుడు సందింటి శ్రీనివాసులు తదితరులున్నారు.తరువాత కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశాంతి నిలయానికి చేరుకొని సాయికుల్వంత హాల్లో శ్రీ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్శనలో రాష్ట్ర మంత్రులు, వివిధ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్య సాయి బాబా మహా సమాధిని సందర్శించిన తర్వాత శ్రీ సత్య సాయి జిల్లాలో జాతీయ రహదారుల గురిం చి కేంద్ర మంత్రి గడ్కరి సంబంధిత అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు.ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి పనుల పురోగతి, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లాలో కొత్తగా గుర్తించిన కనెక్టివిటీ అవసరాలు, రహదారి విస్తరణ, భద్రతా చర్యల బలోపేతం, భవిష్యత్ రహదారి అభివృద్ధి ప్రణాళికలపై పూర్తి వివరాలు అందించారూ. సత్యసాయి జిల్లాలో రోడ్ల నాణ్యత, కనెక్టివిటీ, హైవే సదు పాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేసారు.

రాష్ట్ర మంత్రులకు ఘన స్వాగతం

పుట్టపర్తి టౌన్, నవంబర్ 20, ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఉత్సవాలలో పాల్గొనడానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి మరియు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు గురువారం ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథి గృహం వద్ద పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు పుష్ప గుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రోడ్డు భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డిని ప్రత్యేకంగా కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పది కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నియోజక వర్గంలోని కొన్ని ప్రాంతాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసే విధంగా తగిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంత్రి కందుల దుర్గేష్ ను కోరారు.

మంత్రికి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మాజీమంత్రి

మంత్రి కందుల దుర్గేష్ కు సత్య సాయి బాబా చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి నుండి హరియూర్ వరకు రోడ్లను ఎన్.హెచ్.44తో అనుసంధానించండి

మడకశిర టౌన్ నవంబర్ 20 ప్రభాతవార్త

పుట్టపర్తి నుండి పెనుగొండ, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల రోడ్లను సుమారు 160కిలోమీటర్ల వరకు రోడ్లను జాతీయ రహదారి44కు కర్ణాటకలోని హిరియూర్ వరకు అనుసంధానించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు కోరారు. గురువారం పుట్టపర్తిలోని భగవాన్ శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తికి వచ్చేసిన కేంద్రమంత్రి గడ్కరీని మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితమ్మ, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్ మరియు ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి మరియు ఇతర నాయకులు కలిశారు.

రోడ్లను అనుసంధానించాలని కోరుతూ నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్ల సమస్యలను గడ్కరీకి వివరించారు. తమ వినతిపత్రాన్ని పరిశీలించాలని, తమ ప్రాంతం ప్రజల కోరికను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి గడ్కరీ సాను కూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

,కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికు వినతి పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

హర్యానా స్పీకర్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్, నవంబర్ 20, ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో పాల్గొనడానికి విచ్చేసిన హర్యానా స్పీకర్ హరీందర్ కళ్యాణ్‌ను గురువారం ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథి గృహంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సత్య సాయి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా మాజీ మంత్రి గీతారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్య సాయి చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సన్మానించారు.

హర్యానా స్పీకర్, మాజీ మంత్రి గీతారెడ్డిలతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

సాంకేతికతను అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు తీసుకెళ్లాలి

- వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ నవంబర్ 20 ప్రభాతవార్త

వ్యవసాయ అనుబంధ రంగాలలో పథకాలు, కార్యక్రమాలను ఎలా అమలుచేయాలనే విషయమై సాంకేతికతను అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు తీసుకెళ్లాలని, ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వ యంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరే ట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు వ్యక్తిగతంగా ఆవిష్కరణలు తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. రబీ 2025లో సాధారణ సాగు విస్తీర్ణం 1,07,261 హెక్టార్లు ఉండగా, ఇప్పటివరకు 43,348.2 హెక్టార్లలో పంట లు సాగు చేయగా, 39 శాతం పంటల సాగు జరిగింది. ప్రస్తుతం జిల్లాలో 36,651 మెట్రిక్ టన్నుల యూరియా, డిఏపి, ఎరువులు అందుబాటులో ఉండగా, అందులో 8,726 మెట్రిక్ టన్నుల యూరి యా అందుబాటులో వుంది. క్షేత్రస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, అలాగే ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను ఐఎఫ్ఎంఎస్ లో అప్లోడ్ చేయాల న్నారు. అలాగే రైతు సేవ కేంద్ర సిబ్బంది అన్ని పంటలకు ప్రాంతీయ మార్కెట్ ధరలను సీయం ఆప్ లో నమోదు చేసే విధంగా మార్కెటింగ్ శాఖ వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఎఫ్ఎంఈ పథకం కింద 400 లక్ష్యాన్ని కేటాయించడం జరగగా, ఇప్పటివరకు 33 దరఖాస్తులను మంజూరు చేయడం జరిగిందని, అగ్రికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక, తదితర శాఖల అధికారులు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘంలతో సమావేశం నిర్వహించాలని, ప్రతి సోమవా రం సంబంధించిన నివేదికను అందించాలన్నారు. మిషన్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ కింద రెండు సంవత్సరాలకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. నేషనల్ బ్యాంబో మిషన్ కింద బ్యాంబో సాగుకు రైతులను గుర్తించాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ కింద బ్యాంకుల్లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ఏపీఎంఐపీ కింద రోజు 200 మంది నుంచి నాన్ సబ్సిడీ కలెక్షన్స్ అసలు చేయాల న్నారు. పశు రైతులకు పీకేసిసి కార్డులను మంజూరు చేయించాలని, కేటా యించిన లక్ష్యాలను రెండు నెలల్లోగా చేరుకోవాల న్నారు. సిరికల్చర్ కింద కేటాయించిన లక్ష్యా లను ఖచ్చితంగా పూర్తి చేయా లన్నా రు. ఆత్మ పరిధిలో కార్యక్ర మాలు సక్రమంగా నిర్వహిం చాలని, పొలం పిలుస్తుంది, ఇతర కార్యక్ర మాల్లో ఎక్కువ మంది రైతులు వచ్చేలా చూడా లని, ఆయా కార్యక్ర మాలకు సంబంధించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఫోటోలను అందజే యాలని, ప్రతినెల 25 వేల మంది రైతులకు శిక్షణలను అందించాలని, కంట్రోల్ రూమ్ నుంచి కార్యక్ర మాలపై మానిటర్ చేయాలన్నారు. డీఆర్డీఏ, ప్రకృతి వ్యవసాయం డీపీఎంలు సమన్వయం చేసుకొని ఏటీఎంని మరింత పెంచాల న్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంకి సంబంధించిన ఉత్పత్తులకు మార్కెట్ పరంగా ఏ విధంగా ట్రాక్ చేయాలి అనే దానిపై ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో 194 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉండగా, వాటి పరిధిలో తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ ప్రధాన సమస్య అని, జిల్లాలో ఎఫ్పిఓలు తయారు చేస్తున్న 150 వరకు ఉత్పత్తులను గుర్తించాలని, ఉత్పత్తులను ఎగుమతి చేసే ప్రధాన డిస్ట్రిబ్యూ టర్లతో సమా వేశం నిర్వహించాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్ లలో మార్కెటింగ్ అవకాశాలపై పరిశీలించాలని, జిల్లాలో సత్యసాయి ఫెడరేషన్ సహకారంతో ఉత్పత్తుల అమ్మకాలు విస్తరించేలా చూడాలన్నారు. ఎఫ్పిఓలపై విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ కింద ఎఫ్పిఓలకు ఏమైనా సహకారం అందిం చగలమనేది చూడాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ, మిషన్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ కింద అవసరమైన శాంక్షన్లను ఇస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమా దేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, మార్కెట్ డిఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, డిసిఓ అరుణ కుమారి, ఆత్మా పీడీ పద్మలత, ఎల్డిఎం నరేష్ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం అనురాధ, మార్కెటింగ్, ఫిషరీష్, పశుసంవర్ధక శాఖ జెడి, ఆయా శాఖల అధికారులు, ఎఫ్పిఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పుట్టపర్తికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ కి అభివాదం చేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి తదితరులుఉన్నారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పుట్టపర్తికి ప్రధాని నరేంద్ర మోది వచ్చిన సందర్భంగా అనంతపురము బీజేపీ జిల్లా ప్రదాన కార్యదర్శి అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.